రాంబాబుకి హఠాత్తుగా ఓ ఆలోచన తట్టింది.

తాను ఎలాగూ ఆత్మహత్య చేస్కోవాలని అనుకుంటున్నారు. వాళ్లకి లొంగిపోతే ఆత్మహత్య చేస్కునే శ్రమలేకుండా వాళ్ళే చంపేస్తారుగా?....

బాబోయ్ వాళ్లయితే కత్తులతో పొడుస్తారు. బోల్డంత రక్తం వస్తుంది. నొప్పికూడా పెడుతుంది.

వీళ్లనుండి ఎలాగైనా తప్పించుకుని ఊరి చివరకి వెళ్ళి కొండెక్కి అక్కడినుండి కింద పారేనదిలో దూకెయ్యాలి!..... అనుకున్నాడు రాంబాబు.

రాంబాబు మెల్లగా పేపరు పక్కకి తప్పించి జగ్గు, వీరూలు ఉండే వైపు చూశాడు. వాళ్ళిద్దరూ మొహాలకి పేపర్లు అడ్డుపెట్టుకుని ఇంకా అలానే నిల్చుని ఉన్నారు. మెల్లగా పేపర్ల వెనకనుండి మెయిన్‌రోడ్డుమీద వచ్చే పోయేవారిని గమనిస్తూ ఉన్నారు.

రాంబాబుకూడా పేపరు వెనకానుండి మెయిన్ రోడ్డువైపు చూశాడు రాంబాబుకి పట్టరాని ఆనందం కలిగింది.

దూరంగా స్కూటర్‌మీద శ్యామ్రావు వస్తూ కన్పించాడు. స్కూటర్ దగ్గరగా వచ్చేదాకా ఆగి రంబాబు హఠాత్తుగా మెయిన్‌రోడ్డు వైపు పరుగుతీశాడు.

'స్కూటరాపు..... స్కూటరాపు.....' చేతులు ఊపుతూ రోడ్డుకీ ఆడ్డంగా నిల్చున్నాడు రాంబాబు. శ్యామ్రావు స్కూటరాపాడు. రాంబాబు స్కూటరెక్కి 'వెంటనే పోనియ్.....' అన్నాడు.

'ఎక్కడికి?' అడిగాడు శ్యామ్రావు.

'నువ్విప్పుడు ఎటు వెళుతున్నవో అటే ఎక్కడికైన ఫరవాలేదు'

స్కూటర్ ముందుకు దూకుంది.

ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

జగ్గు వీరూలకి ఏం జరిగిందో తెలిసేలోగా స్కూటర్ కనుచూపుమేర దాటుకుని వెళ్ళిపోయింది.

'హు!...తప్పించుకుని వెళ్ళిపోయాడు .....' వీరూ గుండు రుద్దుకుంటూ బాధగా అన్నాడు.

'ఎప్పుడైనా దొరక్కపోడు. నువ్వేమీ బాధపడకు' జగ్గు వీరూని ఊరడించాడు.

స్కూటర్ కాస్తదూరం వెళ్లిన తరువాత శ్యామ్రావు అడిగాడు 'నువ్వు ఎక్కడికి వెళ్లాలి?'

'ఇక్కడాపు....దిగిపోతాను' అన్నాడు రాంబాబు.

శ్యామ్రావు స్కూటరాపాడు.

రాంబాబు స్కూటర్ మీంచి దిగాడు.

'స్టూడియో ఇప్పుడెలా నడుస్తుంది?' అడిగాడు శ్యామ్రావు.

'బాగానే నడుస్తుంది..... నీ స్టూడియో?'

'ప్రస్తుతానికి బాగానే ఉంది .....' నవ్వాడు శ్యామ్రావు.

'మరి నేనొస్తాను....' అన్నాడు రాంబాబు.

'ఓకే....సీయూ.....'

శ్యామ్‌ట్రావు స్కూటరుమీద రివ్వున వెళ్ళిపోయాడు.

రాంబాబు అటుగా వెళ్తున్న ఖాళీ ఆటోని పిలిచాడు.

'వస్తావా?' అడిగాడు ఆటోవాడిని.

'యాడ్కిపోవాలె?' అన్నాడు ఆటోవాడు.

'ఊరి చివరికి .... అక్కడొక పెద్దకొండవుందిగా కొండ అవతల నది ఉందే అక్కడికి!'

'రానుసాబ్.... ఆడ్కెళ్ళి సవారీ దొరకదు....ఖాళీగా వాపస్ రావాలి.'

'ఇక్కడి నుండి అక్కడికి మీటర్‌లో పదిహేను రూపయలౌతుంది. నువ్వు వెనక్కి రావడానికి మరో పదిహేను రూపాయలు మొత్తం ముప్పై రూపాయలిస్తాను ....వస్తావా?'

'రాను...నలభై ఇస్తే వస్తాను'

ముప్పై ఇస్తాను....వస్తేరా లేకపోతే లేదు....' అని రాంబాబు అడుగులు ముందుకు వేశాడు.

కాని మరుక్షణం అతనికి గుర్తుకు వచ్చింది తను ఆత్మహత్య చేస్కోబోతున్నట్టు. చచ్చేముందు డబ్బుతో తనకేంపని?..... ఇలా బేరాలాడ్డం ఎందుకు?.... విరక్తిగా నవ్వుకున్నాడు.

'సరే పద.....' అన్నాడు ఆటోవాడితో.

రాంబాబు ఆటో ఎక్కాడు. ఆటో వేగంగా ముందుకుదూకింది.

## *ఫ్రేమ్ - 24*

## *రాంబాబు దొరికాడు*

అప్పటికి గంటనుండి పోలీసు జీపు హైదరాబాద్ నగరంలోని వీధులన్నీ తిరిగింది. శ్రీరామ్‌కి ఎక్కడా రాంబాబు కనిపించలేదు. జీపువెనక భాగంలో కూర్చున్న సరోజ కిష్టయ్య ఆందోళనగా బయటికి తొంగి చూస్తున్నారు. ఎక్కడైనా రాంబాబు కనిపిస్తాడేమోనని.

ఇంకాస్సేపు అలా మరికొన్ని రోడ్లు తిరిగారు.

'ఇహ లాభం లేదనిపిస్తుంది..... ఈ వాల్టికి ఈ వెతకడం ఆపి రేపు మళ్ళీ చూద్దం .... ఎక్కడికి పోతాడు...నేను అతన్ని పట్టుకోకపోను, షూట్ చెయ్యకపోను.....మా పాతపగలు కూడా ఉన్నాయి.....' అన్నాడు పిడికిళ్ళు బిగిస్తూ శ్రీరామ్.

'పాత పగలా?.... అవేంటండీ?' నాగరాజు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

'మా అమ్మాయిలు మొహాలని తియ్యమంటే కాళ్ళని ఫోటో తీశాడు.

'బహుశా మీ అమ్మాయిల కాళ్ళు బాగా నచ్చాయేమోనండీ రాంబాబు గారికి....' అన్నాడు కానిస్టేబులు నూటపదకొండు.

'షటప్ .... నువ్వు మధ్యలో మాట్లాడేవంటే షూట్ చేస్తాను.....'

'యస్ సార్ .....'

'డ్రైవర్ .... జీపుని స్టేషనుకి పోనియ్.....' అన్నాడు శ్రీరామ్.

సరోజ కిష్టయ్య కంగారుపడ్డారు.

'సార్ ..... మరి రాంబాబు మాటో?' అన్నాడు కిష్టయ్య ఆందోళనగా.

'రాంబాబు విషయం రేపు చూస్కుందాం ....నా నుండి తప్పించుకుని ఎక్కడికి పోతాడు?..... షూట్ చేసేస్తాను.....'

'కానీ ఈలోగా అతను ఆత్మహత్య చేసుకుంటాడు.....'

'ఓహ్!..... ఆ విషయమే మర్చిపోయాను......

కానీ ఇంత వెతికినా దొరకలేదు....నేనేం చెయ్యను?' వాపోయాడు శ్రీరామ్.

'ఇంత బిజీరోడ్లలో పట్టపగలు ఎవరికీ కనబడకుండా ఆత్మహత్య చేస్కోడం కష్టం కదాసార్?' అన్నాడు కిష్టయ్య.

'ఊ అయితే?.....'

'బహుశా ఊరు చివరకెళ్ళి అక్కడ ఏ కొండ మీదినుండో చెర్లోకి దూకి ఆత్మహత్య చేస్కుంటాడేమో సార్ మా గురూగారు. సినిమాల్లో కూడా అలానే చేస్కుంటారు సార్......'

ఇన్స్పెక్టర్ శ్రీరామ్ కళ్ళు వెలిగాయ్.

'యస్......యూ ఆర్ కరెక్టు.....డ్రైవర్ ఊరు చివరికి పోనియ్' హుషారుగా అరిచాడు శ్రీరామ్.

'ఊరు ఏ చివరికి సార్ ? ...... ఈ చివరకా? ఆ చివరికా?' అన్నాడు డ్రైవర్.

ఇన్స్పెక్టర్ శ్రీరామ్ కిష్టయ్య వంకచూసి కళ్ళెగురవేసాడు.

'ఆ చివరకే వెళ్లడం మంచిదిసార్..... అటైతే చెరువుంది'

'అటే పోనియ్ డ్రైవర్ .....'

జీపు రయ్యిన దూసుకు వెళ్ళింది. ఒక పావుగంట తరువాత జీపు ఊరు చివరకి చేరుకుంది. జీపులోని అందరూ ఆతృతగా రోడ్డుకి ఇటూ అటూ చూస్తున్నారు రాంబాబు కనిపిస్తాడేమోనని.

సరోజ హఠాత్తుగా అరిచింది.

'కెవ్వ్వ్ ......'

శ్రీరామ్ కంగారు పడిపోయాకు.

'డ్రైవర్ జీపాపకు...నేనేం జీపులోంచి పడిపోలేదు.....' సరోజ బిగ్గరగా అంది.

'మరెందుకు అరిచారు ఎవరో షూట్ చేసినట్టు?'

'అదిగో ..... అక్కడ కొండమీద రాంబాబు ..... అతన్ని చూసే అరిచాను ...... డ్రైవర్.... త్వరగా ముందుకు పోనియ్.....' కంగారుగా అంది సరోజ.

అందరూ సరోజ చూపించిన దిక్కుగా చూశారు..... దూరంగా కొండమీద నల్లని బట్టలతో, చెదిరిన క్రాపుతో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నాడు రాంబాబు.

'త్వరగా పోనియ్ డ్రైవర్......లేపోతే షుట్ చేస్తాను......' శ్రీరామ్ కూడా కంగారుగా అన్నాడు.

జీపు వేగంపుంజుకుని రెండు నిముషాల్లో కొండకి సమాంతరంగా వచ్చింది.

'ఇంక ఇక్కడ ఆపు..... ఇక్కడ నుండి కొండమీదికి పరుగెత్తుకుంటూ వెళ్ళాల్సిందే!......' అన్నాడు ఇన్స్పెక్టర్ శ్రీరామ్.

జీపు ఆగింది. అందరూ జీపులోంచి చకచకా కిందికి దుమికాడు.

ఏయ్ నూటపదకొండు..... నిన్ను షూట్ చేస్తాను......' శ్రీరాయ్ గట్టిగా అరిచాడు.

'నేనేం చేశాను సార్?' బిత్తరపోతూ అడిగాడు నూటపదకుండు.

'నువ్వు నాకాలుమీద దూకావ్ ... అబ్బా!......'

'క్షమించాలిసార్.....'

'ఫోర్ ట్వెంటీ ఏడీ?.....'

'ఇంకా జిపులోనే ఉన్నాడు సార్!'

'ఏయ్ ఫోర్ ట్వెంటీ! త్వరగా జీపులోంచి దూకు..... క్విక్'

కానిస్టేబుల్ ఫోర్ ట్వెంటి కూడా జీపులోంచి  దూకాడు.

'హబ్బా....నిన్ను నిలువెల్లా షూట్ చేయ్యా.....'

'మీరు చెప్పినట్టే దూకానుకదా సార్?' అన్నాడు కానిస్టేబుల్ ఫోర్ట్వెంటీ బిక్కమొహం వేస్తూ.

'నువ్వుకూడా నా కాలుమీదే దూకావ్.....ఉస్స్స్......'

'సార్.....మీరిలా షూట్ చేస్తాను అంటూ తిట్టుకుంటూ కూర్చుంటే అవతల రాంబాబు నదిలో దూకేస్తాడుసార్' అన్నాడు కిష్టయ్య.

'త్వరగా రండిసార్..... అతన్ని కటకటాల్లో తోయించండి సార్ పెళ్ళి జరిపించండి సార్' అన్నాడు నాగరాజు.

'జైళ్లలో పెళ్ళిళ్ళూ చేస్కోడానికి రూల్సు ఒప్పుకోవు......'

'పెళ్ళి అతనికి కదా్సర్....నాకు.....'

'ఉండవయ్యా అవతల హంతకుడు పారిపోతుంటే మధ్యన నీ పెళ్ళి గోల ఒకటి...నిన్నూ పెళ్ళి కూతుర్నీ ఇద్దర్నీ షూట్ చేస్తాను....ఏయ్ నూటపదకుండూ, ఫోర్ ట్వెంటీ...... కమాన్ ఫాలోమీ.....'

శ్రీరామ్ ముందుకు పరుగుతీసాడు. అతని వెనకాలే కానిస్టేబుళ్ళూ సరోజ, కిష్టయ్యా నాగరాజూ కూడా పరుగుతీసారు.

'రాంబాబూ.....ఆగు రాంబాబూ......' సరోజ బిగ్గరగా అరిచింది.

'గురూగారూ...... ఆగండి గురూగారూ' కిష్టయ్య కూడా అరిచాడు.

'రాంబాబూ..... ఆగు .....లేకపోతే షూట్చేస్తాను....' ఇన్స్పెక్టర్ కూడా అరిచాడు.

కానీ వీళ్ళ అరుపులు రాంబాబు చెవిని సోకలేదు. అతను తన ధ్యాసలో తను ఉన్నాడు..... అంతేగాక వీళ్ళకి బాగా దూరంగా ఉన్నాడు.

అందరూ ప్రయాసపడుతూ వగరుస్తూ కొండమీదికి ఎక్కుతున్నారు.

'ప్లీజ్ రాంబాబూ.....కాస్త ఆగు షూట్ చేస్తాను' శ్రీరామ్ ఆయాసపడుతూ అన్నాడు.

'నీ ఇష్టం ....దూకితే దూకెయ్ రాంబాబూ.....ఒకళ్ళ వ్య క్తిగత విషయాల్లో నేను అడ్డుపడను.....' గట్టిగా అరిచాడు నాగరాజు.

'రాంబాబూ ....ఆగు రాంబాబూ'

'గురూగారూ ఆగండి గురూగారూ.....'

సరోజ, కిష్టయ్య కోరస్‌గా అరిచారు.

రాంబాబు ఈ లోకంలో లేడు.

మెల్లగా నడుస్తూ కొండ అంచుకు చేరుకున్నాడు.

'సరోజా ....వెళ్ళోస్తా సరోజా....వచ్చేజన్మలోనైనా మనం భార్యా భర్తలం కావాలని ఆశిస్తున్నాను సరోజ..... ఏ నాటికైనా నీ మనసులోని అపోహలు తొలగిపోతాయని స్వచ్ఛ మైన నా ప్రేమని గుర్తిస్తావనీ......'

రాంబాబు చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకున్నాడు.

ఓసారి కిందికి వంగి చూసాడు.

కింద నది గంభీరంగా ప్రవహిస్తుంది. రాంబాబు కళ్ళు తిరిగాయ్......

'బాబోయ్ ..... ఇప్పుడు ఇక్కడి నుండి దూకాలా?...నదిలోకాకుండా ఏ రాయిమీదో పడితే తలకాయి చిదుకుతుంది...నేను అనవసరంగా ఈ నిర్ణయం తీసుకున్నానేమో!!.... వెనక్కి వెళ్ళిపోతేనో?....' అనుకున్నాడు రాంబాబు.

'రాంబాబూ...... దూకొద్దు రాంబాబూ.....' సరోజ గట్టిగా అరిచింది.

సరోజ గొంతు రాంబాబుకి వినిపించింది. కానీ అది సరోజ అరిచింది అనుకోలేదు.....

తన ఊహ అనే అనుకున్నాడు.

'అవును సరోజ..... నేనూ అదే ఆలోచిస్తున్నాడు రాంబాబు.

'గురూగారూ...... దూకొద్దండీ.....'

కిష్టయ్య గొంతు వినిపించింది.....ఇది కూడా తన భ్రమే అనుకున్నాడు రాంబాబు. అలా అనుకోక తనకి కాస్తంత దూరంలో వీళ్ళందరూ ఉన్నారని ఎలా అనుకుంటాడు?

'కిష్టయ్య .....' కళ్ళు మూసుకున్నాడు రాంబాబు.

'ఆలోచిస్తున్నాను రా కిష్టయ్యా......'

'రాంబాబూ..... ఆగు .....లేకపోతే షూట్ చేస్తాను ......'

రాంబాబు ఉలిక్కి పడ్డాడు.

‘ఈ ఇన్‌స్పెక్టర్ గొంతు ఎక్కడినుండి వినిపిస్తుందా?!.....’

‘ఆగు ......ప్లీజ్ .....షూట్ చేస్తా......’

రాంబాబుకి అనుమానంవచ్చి తల త్రిప్పిచూసాడు.

కాస్తదూరంలో ఆపసోపాలు పడుతూ సరోజ, కిష్టయ్య, నాగరాజు, ఇన్‌స్పెక్టర్. కానిస్టేబుల్లు కొండ ఎక్కడం కనిపించింది రాంబాబుకి.

రాంబాబుకి చాల ఆశ్చర్యం వేసింది.

వీళ్ళంతా హఠాత్తుగా ఇక్కడికి ఎలా వచ్చారు?!

‘రాంబాబూ...నీ మీద కోపంలేదు....ఐ లవ్యూ రాంబాబూ...... కొండమీదినుండి దూకకు రాంబాబూ.....’ సరోజ రాంబాబు కేసి చెయ్యిఊపుతూ అంది.

సంతోషంతో సర్‌ప్రైజ్‌తో రాంబాబు గుండె ఒక్కక్షణం ఆగిమళ్ళీ కొట్టుకోడం మొదలు బెట్టింది.

‘యాహూ.....’

రాంబాబు గట్టిగా కేకపెట్టి గబగబ కొండదిగిసాగాడు.

సరోజ, కిష్టయ్య సంతోషంతో ఒకరినొకరు చూస్కుంటూ షేక్ హాండ్ ఇచ్చుకున్నారు.

### *రాంబాబు తప్పించుకున్నాడు*

‘మొత్తానికి హంతకుడిని పట్టేశారు సార్..... సాధ్యమైనంత త్వరలో అతన్ని ఉరికంబం ఎక్కించాలి సార్’ అన్నాడు నాగరాజు సంబరంగా.

‘ఎక్కించక వదుల్తానా?’ అన్నడు శ్రీరామ్ ఉత్సాహంగా.

కిష్టయ్య సరోజ మొహమొహాలు చూసుకున్నారు. వాళ్ళకి అప్పటికి పరిస్థితి అర్థం అయ్యింది.

రాంబాబుకి తనమీద హత్యానేరం మోపబడిందనీ, పోలీసులు తనని అరెస్టు చేయడానికి వచ్చారనీ తెలీదు. రాంబాబుని ఎలాగైనా కిందికి దిగకుండా ఆపాలి!

ఎలా? ఎలా? ఎలా?

రాంబాబు గబగబా కొండ దిగుతున్నాడు. కిష్టయ్యకి హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది.

‘త్వరగా రాంబాబూ ..... నువ్వు హత్యచేసావనుకుని నిన్ను అరెస్టు చేయడానికి వచ్చారు.....’ గట్టిగా అరిచాడు కిష్టయ్య.

‘అవును రాంబాబూ..... నువ్వు నీలిమని హత్య చేసావనుకుంటున్నారు...నీ నిర్దోషిత్వం నిరూపించుకోవాలి.....’ సరోజ కూడా గట్టిగా అరిచింది.

వీళ్ళ మాటలు విన్న రాంబాబు ఠక్కున ఆగిపోయాడు. అయోమయంగా ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ వంక చూశాడు.